


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 251 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శనివారం 17 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :251 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SAT 16 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## చంద్రబాబు సంచలన నిర్ణయం... కేవలం ఆన్ లైన్ లోనే మహానాడు!

- పొదుపు చర్యలు ప్రకటించిన ప్రధాని మోదీ
- నెల్లూరులో మహానాడు నిర్వహణకు ఇప్పటికే ముమ్మర ఏర్పాట్లు
- మోదీ పిలుపు నేపథ్యంలో చంద్రబాబు కీలక నిర్ణయం
- హైబ్రిడ్ విధానంలో రెండ్రోజుల పాటు టీడీపీ మహానాడు
- ఎన్టీఆర్ భవన్ లో స్టేజి ఏర్పాటు... రాష్ట్రవ్యాప్తంగా స్క్రీన్లపై ప్రసారం



పెన్ పవర్ డెస్క్:టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు పొదుపు చర్యల్లో భాగంగా టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని ఈ ఏడాది కేవలం ఆన్ లైన్ లోనే జరపాలని నిర్ణయించారు.
వాస్తవానికి ఈ నెల 27, 28, 29 తేదీల్లో నెల్లూరులో ఘనంగా మహానాడు నిర్వహించేందుకు ఏర్పాట్లు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే, ప్రధాని మోదీ పశ్చిమాసియా సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంధన పొదుపుపై జాతికి దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు పొదుపు చర్యలు పాటిస్తూ అందరికీ

- మిగతా 2లో




- చిన్న చేపల అరెస్ట్‌తో కేసు ముగిసిందా..?
- అసలు తిమింగలాలు ఇంకా బయటేనా..?
- సెటిల్మెంట్ సామ్రాజ్యానికి రాజకీయ అండ ఎవరిది..?
- పోలీస్-మధ్యవర్తులు-నే తల మధ్య గోప్య ఒప్పందాలేమిటి..?
- డీఎస్పీ కార్యాలయం వరకు విస్తరించిన అంతర్గత లింకులపై సంచలన ఆరోపణలు
- గూడెంలో బయటపడని పేర్లు..!
- తదుపరి ఎపిసోడ్‌లో మరిన్ని పేర్లు..?

- మిగతా 2లో

ఎడిటర్, పెన్ పవర్ తాడేపల్లి గూడెం/ భీమవరం మే 15:

ఒక ఎస్సై అరెస్ట్‌తో కథ ముగిసిందని భావించినవారికి గూడెం వ్యవహారం ఇప్పుడు మరింత మరో పెద్ద మలుపు తిరుగుతుంది. బయటకు కనిపించింది చిన్న చేప మాత్రమేనని... అసలు తిమింగలాలు ఇంకా నీటిలోనే తిరుగుతున్నాయనే చర్చ గూడెం రాజకీయ, పోలీస్, మధ్యవర్తుల వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సెటిల్మెంట్ రాజకీయం, అధికార దుర్వినియోగం, కోట్ల రూపాయల డీల్స్ వెనుక ఉన్న అసలు శక్తులు ఎవరు అన్న దానిపై పెన్ పవర్ లోతైన పరిశీలన ప్రారంభించింది.



## తొలకరి కబురు... ఈ నెల 26నే కేరళకు రుతుపవనాలు

- ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే రానున్నాయని ఐఎండీ ప్రకటన
- సాధారణ తేదీ జూన్ 1 కాగా, మే 26నే కేరళను తాకే అవకాశం
- నాలుగు రోజులు అటూఇటూగా ఉండొచ్చని తెలిపిన భారత వాతావరణ శాఖ
- ఆధునిక స్టాటిస్టికల్ మోడల్ ఆధారంగా ఈ అంచనాను విడుదల చేసిన ఐఎండీ
- గత 21 ఏళ్లలో ఐఎండీ అంచనాలు ఒక్కసారి మినహా దాదాపుగా నిజ

దేశవ్యాప్తంగా ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ (IMD) చల్లని కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందుగానే దేశంలోకి ప్రవేశించ నున్నాయని అధికారికంగా ప్రకటించింది.

వివరాలు 2లో..



## గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో ఏపీ.. పవన్ కల్యాణ్ ప్రశంసలు

- పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు శంకుస్థాపన
- చారిత్రాత్మక ఘట్టమన్న పవన్ కల్యాణ్
- పారిశ్రామికంగా ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్య

- మిగతా 2లో



## రక్షణ హబ్‌గా రాయలసీమ.. పుట్టపర్తిలో స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టుకు భూమిపూజ...

- పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి పాల్గొన్న సీఎం చంద్రబాబు
- రూ.15,803 కోట్ల పెట్టుబడితో ఐదో తరం యుద్ధ విమానాల తయారీ
- రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని సీఎం హామీ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను రక్షణ, వైమానిక రంగంలో కీలక కేంద్రంగా మార్చే దిశగా శుక్రవారం భారీ ముందడుగు పడింది. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సుమారు రూ. 15,803 కోట్ల భారీ వ్యయంతో ఏర్పాటు చేయనున్న అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన

- మిగతా 2లో

## వాళ్లు ముగ్గురు 75 ఏళ్ల కుర్రాళ్లు... వాళ్లది పవర్ ఫుల్ కాంబో

- పుట్టపర్తిలో ఏఎంసీఏ స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్ట్‌కు భూమిపూజ
- మోదీ, రాజ్ నాథ్, చంద్రబాబు 75 ఏళ్ల కుర్రాళ్లు అంటూ లోకేష్ ప్రశంసలు
- వారిలో 25 ఏళ్ల యువకులు ఉన్నారని, వారి స్పీడ్ తట్టుకోలేమన్న లోకేష్
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఐరన్ మ్యాన్‌గా అభివర్ణన



పెన్ పవర్ డెస్క్:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు.. వీరంతా 75 ఏళ్ల కుర్రాళ్లు

- మిగతా 2లో

## వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లోనే నీట్ యూజీ

- వచ్చే ఏడాది నుంచి నీట్ యూజీ పరీక్ష పూర్తిగా కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహణ
- పేపర్ లీకేజీతో రద్దయిన పరీక్షను జూన్ 21న మళ్లీ నిర్వహించనున్నట్లు ప్రకటన
- నీట్ పేపర్ లీకేజీపై సీబీఐతో లోతైన విచారణకు ఆదేశించినట్లు తెలిపిన కేంద్రమంత్రి
- రీ-ఎగ్జామ్ కోసం విద్యార్థులకు ఫీజు వాపస్, ఉచితంగా పరీక్ష నిర్వహణ
- పరీక్షకు వారం ముందు సెంటర్ సిటీని ఎంచుకునే వెసులుబాటు

- మిగతా 2లో





## యూఏఈ పర్యటనలో ప్రధాని మోదీ.. కీలక ఒప్పందాలపై సంతకాలు

- పశ్చిమాసియా సంక్షోభం వేళ యూఏఈలో ప్రధాని మోదీ పర్యటన
- ఇంధన భద్రత, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే ప్రధాన లక్ష్యం
- ఎల్పీజీ, పెట్రోలియం నిల్వలపై కుదిరిన కీలక ఒప్పందాలు
- భారత్‌లో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు యూఏఈ అంగీకారం
- గుజరాత్‌లో షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటుకు మరో కీలక ఎంఓయూ

వివరాలు 2లో..




## పోక్సో కేసులో.. కానిస్టేబుల్ కు 30 ఏళ్ల జైలు శిక్ష

పెన్ పవర్ డెస్క్: బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ లో నమోదైన పోక్సో కేసులో సంచలన తీర్పు చెప్పింది పోక్సో స్పెషల్ కోర్టు. ఈ కేసులో దోషిగా తేలిన కానిస్టేబుల్ కు 30ఏళ్ల జైలు శిక్ష విధించింది. బాధిత మైనర్ కు లక్ష రూపాలయ పరిహారం

- మిగతా 2లో

## 'చేప ప్రసాదం' కోసం సిద్ధమవుతున్న హైదరాబాద్

- ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా జరిగే మృగశిర కార్తె చేప ప్రసాదం కార్యక్రమం
- ఆస్తమా, శ్వాసకోశ సమస్యలలో బాధ పడేవారికి ఔషధంగా చేప ప్రసాదం
- ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్



- మిగతా 2లో

## పోక్సో కేసులో బండి సంజయ్ ఫొటోలు, వీడియోల వాడొద్దు.. సిటీ సివిల్ కోర్టు ఆదేశం

పెన్ పవర్ డెస్క్: తన కొడుకు బండి భగీరథ్ కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ ఫొటోలు, వీడియోలు వాడొద్దని సిటీ సివిల్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. బండి భగీరథ్ కేసులో తన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో, యూట్యూబ్




- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లోనే నీట్ యూజీ

దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ (చీజుజు ఖ+) పరీక్షా విధానంలో కేంద్ర ప్రభుత్వం కీలక సంస్కరణను ప్రకటించింది. వచ్చే ఏడాది నుంచి ఈ పరీక్షను పూర్తిగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. జాతీయ ప్రవేశ పరీక్షల వ్యవస్థలో ఇది ఒక ప్రధాన సంస్కరణగా నిలవనుంది. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... పేపర్ లీకేజీ కారణంగా రద్దు చేసిన నీట్ యూజీ 2026 పరీక్షను తిరిగి జూన్ 21న నిర్వహించనున్నట్లు ధ్రువీకరించారు. దీనికి సంబంధించిన అడ్మిట్ కార్డులను జూన్ 14 నాటికి జారీ చేస్తామని తెలిపారు. మే 3న పరీక్ష నిర్వహించగా, మే 7న "గెస్ పేపర్" గురించి ఆందోళనలు వ్యక్తమయ్యాయని, కొద్ది రోజుల్లోనే పేపర్ లీక్ అయినట్లు అధికారులు నిర్ధారించారని ఆయన వివరించారు. "లీకేజీ వాస్తవమని తేలిన వెంటనే, విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడకూడదని నిర్ణయించుకుని మే 12న పరీక్షను రద్దు చేశాం" అని ప్రధాన్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలను, అసాంఘిక శక్తులను ఏమాత్రం సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ పేపర్ లీకేజీ ఘటనపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) తో లోతైన విచారణ జరిపిస్తామని, దీని మూలాలను కనుగొనాలని ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. "కష్టపడి చదివే విద్యార్థుల సీట్లను ఏ మాఫియా కూడా లాక్కోవడానికి వీల్లేదు. విద్యార్థుల నమ్మకమే మాకు అత్యంత ముఖ్యం" అని ఆయన అన్నారు. గతంలో ఇలాంటి సంఘటనల నేపథ్యంలోనే రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఆ కమిటీ సిఫార్సులను అమలు చేసినప్పటికీ, పరీక్షల నిర్వహణలో లోపం జరిగిందని అంగీకరించారు. సుప్రీంకోర్టు సిఫార్సు మేరకు ఏర్పాటైన ఎన్‌టీఏలో నిరంతర సంస్కరణలు జరుగుతున్నాయని, 'జీరో-ఎర్రర్' పరీక్షల నిర్వహణకు వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రద్దయిన పరీక్షకు హాజరైన అభ్యర్థులకు వారి పరీక్ష ఫీజును తిరిగి వాపసు ఇస్తామని, త్వరలో నిర్వహించే రీ-ఎగ్జామ్‌ను ఉచితంగా నిర్వహిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం పరీక్షకు వారం రోజుల ముందు తమకు నచ్చిన పరీక్షా నగరాన్ని ఎంచుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వీలైనంత వరకు రవాణా సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు.

## రక్షణ హబ్‌గా రాయలసీమ.. పుట్టపర్తిలో స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టుకు భూమిపూజ...

- మొదటి పేజి తరువాయి

చేశారు. ఈ కార్యక్రమం ద్వారా దేశీయంగా ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్‌ల అభివృద్ధి, తయారీకి మార్గం సుగమం కానుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టుతో పాటు అనకాపల్లి జిల్లాలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) నావల్ సిస్టమ్స్ యూనిట్, కర్నూలులో ఏర్పాటు చేయనున్న 'డ్రోన్ సిటీ' సహా మొత్తం రూ.4,145 కోట్ల విలువైన మరో 12 రక్షణ ప్రాజెక్టులకు కూడా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. దేశానికి ఆంధ్రప్రదేశ్ రక్షణ కవచంగా నిలుస్తోందన్నారు. "ఒకప్పుడు రతనాల సీమగా ఉన్న రాయలసీమను మళ్లీ అదే స్థాయికి తీసుకెళ్లే బాధ్యత నాది. కడప స్టీల్ ప్లాంట్ పనులను జూన్‌లో ప్రారంభించి 2028 నాటికి పూర్తి చేసి సీమకు కానుకగా ఇస్తాం," అని ఆయన హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన రక్షణ ఉత్పత్తుల ప్రదర్శనను సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మంత్రి లోకేష్ తిలకించారు. ఇందులో అత్యాధునిక క్షిపణులు, తుపాకులు, హ్యాండ్ గ్రెనేడ్లు, యుద్ధ విమానం ప్రోటోటైప్‌లను పరిశీలించారు. ఈ ప్రాజెక్టులను డీఆర్‌డీవో ఆధ్వర్యంలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) అభివృద్ధి చేస్తోంది.

## పోక్సో కేసులో బండి సంజయ్ ఫొటోలు, వీడియోల వాడొద్దు.. సిటీ సివిల్ కోర్టు ఆదేశం

- మొదటి పేజి తరువాయి

ఛానళ్లలో వాడుతూ తన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని వెంటనే ఫొటోలు, వీడియోలను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ వేశారు బండి సంజయ్. విచారణ చేపట్టిన కోర్టు.. ఈ కేసులో బండి సంజయ్ ఫొటోలు,వీడియోలు వాడొద్దని, అలా వాడితే మీడియాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. తన కొడుకు బండి భగీరథ్ కేసులో తన పేరు, ఫొటోలు, వీడియోలు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని శుక్రవారం (మే15) హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు కేంద్ర మంత్రి బండి సంజయ్. తన ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రచారం జరుగుతోందని తన పేరుతో ఇప్పటివరకు సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానళ్లలో ఉన్న వీడియోలను తొలగించాలని కోర్టును కోరారు. మంత్రి బండి సంజయ్ పిటిషన్ విచారణ చేపట్టిన సిటీ సివిల్ కోర్టు ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.

బండి భగీరథ్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ పేరును వాడొద్దంటూ గ్యాగ్ ఆర్డర్ జారీ చేసి హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు..?బండి భగీరథ కేసు విషయంలో బండి సంజయ్ పేరును ఎక్కడా ఉపయోగించరాదని స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో ఇప్పటివరకు అప్లోడ్ చేసిన వీడియోలను డిలీట్ చేయాలని, అలా చేయకుంటే అలాంటి మీడియాపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

# పరిధి దాటుతున్న తిమింగలాలు..!




**1. అసలు తిమింగలం ఎక్కడ?**

కేసులో ఇప్పటికే ఒకరిపై చర్యలు జరిగినప్పటికీ... అసలు వ్యవహారాన్ని నడిపించిన కీలక వ్యక్తులు ఇంకా బయటే ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం ఫీల్డ్ స్థాయిలో పనిచేసిన వారినే బలి పశువులుగా మార్చే ప్రయత్నం జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి.

**2. రాజకీయ శక్తుల అండ ఎవరికీ?**

గూడెం పరిధిలో కొందరు ప్రజాప్రతినిధుల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ నేతల పేర్లు కూడా చర్చకు వస్తుండటం సంచలనంగా మారింది. సెటిల్మెంట్ల ద్వారా వచ్చిన డబ్బు ఎక్కడికి వెళ్లిందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

3. సెటిల్మెంట్ బ్యాచ్ అసలు నాయకత్వం ఎవరి చేతుల్లో?

స్థానికంగా పని చేసే కొందరు వ్యక్తులు కేవలం ఫ్రంట్ మాత్రమేనని... అసలు ఆదేశాలు మరో కేంద్రం నుంచి వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. బాధితులు కూడా ఇదే విషయాన్ని ప్రైవేట్‌గా చెబుతున్నట్టు సమాచారం.

**4. మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న కీలక వ్యక్తులు ఎవరు?**

వ్యాపారులు, రియల్ ఎస్టేట్ వర్గాలు, కొందరు స్థానిక ప్రభావశీలులు... వివాదాల్లో రాజీ పేరుతో రంగంలోకి దిగుతున్నట్టు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌కు వెళ్లకముందే డీల్స్ క్లోజ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**5. ప్రభుత్వ శాఖల్లో మరిన్ని తిమింగలాలున్నాయా?**

రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ విభాగాల్లో కొన్ని అనుమానాస్పద లింకులపై ఇప్పుడు చర్చ నడుస్తోంది. ఫైళ్లు కదలడానికి ప్రత్యేక వ్యవస్థ పని చేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.

6. పోలీస్--రాజకీయ--మధ్యవర్తుల లింకులు

ఈ మూడు వర్గాలు కలిసి పనిచేశాయా? అనే అనుమానం బలపడుతోంది. బాధితుల ఫిర్యాదులు ఎందుకు నమోదు కాలేదన్న ప్రశ్నలు ఇప్పుడు కీలకంగా మారాయి.

**7. పోలీస్ శాఖలో అసలు అవినీతి తిమింగలం ఎవరు?**

కీలక అధికారుల పేర్లు బయటకు రాకుండా తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం ఉంది. లోపలి విచారణలో కీలక విషయాలు బయటకు రావచ్చని సమాచారం.

**8. "బాదం పప్పు" నుంచి డీఎస్పీ కార్యాలయం లో అప్పా వరకు ఉన్న రహస్య సంబంధం ఏంటి?**

స్థానికంగా కోడ్ పేర్లతో వ్యవహరించే కొందరు వ్యక్తులు ఉన్నారన్న ప్రచారం ఉంది. డీఎస్పీ కార్యాలయం వరకు లింకులు ఉన్నాయా? అన్న కోణంలో కూడా పరిశీలన జరుగుతోందని సమాచారం.

**9. "పరిధి దాటుతున్నావ్... జాగ్రత్త" అంటూ**

ఇటీవల ఓ సీ ఐ స్థాయి అధికారి ఆ తిమింగలానికి వార్నింగ్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఆ హెచ్చరిక ఎవరికి? ఎందుకు? అన్నది ఇప్పుడు ఆసక్తికర అంశంగా మారింది.

**10. నాయకుడి ఇంటి వద్ద ఎందుకు కాపలా?**

శుక్రవారం ఉదయం నుంచి ఓ కీలక రాజకీయ నాయకుడి ఇంటి వద్ద ఆ పప్పు తిమింగలం పడిగాపులు కాస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం ప్రకారం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఏదైనా కీలక డ్యామేజ్ జరగకుండా ఆ నాయకుడు కంట్రోల్ చేస్తాడనే ఆశ తో ఆ పప్పు చేయని ప్రయత్నాలు లేవని ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**బాధితులు ముందుకు వస్తారా? :**

ఇప్పటివరకు భయంతో నోరు విప్పని పలువురు బాధితులు ఇప్పుడు బయటకు రావడానికి సిద్ధమవుతున్నారన్న సమాచారం కూడా ఉంది. మరిన్ని ఫిర్యాదులు మరికొన్ని తిమింగలాలపై వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఈ వ్యవహారంలో పేర్లు బయటకు రాని అసలు సూత్రధారులు ఎవరు?

ఎవరెవరు ఎంత సంపాదించారు?

ఎవరెవరు రక్షణ కల్పించారు?

**అన్న అంశాలపై పెన్ పవర్ వచ్చే ఎపిసోడ్‌లో మరిన్ని సంచలన విషయాలు ...!?**

**"చిన్న చేపలు చిక్కాయి... అసలు తిమింగలాలు ఎప్పుడు?" అన్నదే ఇప్పుడు గూడెం ప్రజల ప్రశ్న.... మరి ఆ తిమింగలాలు ఏసీబీ వాళ్లకు చిక్కుతాయా లేక తప్పించుకుంటాయా వేచి చూడాల్సిందే...**

# యూఏఈ పర్యటనలో ప్రధాని మోదీ.. కీలక ఒప్పందాలపై సంతకాలు

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ఇంధన సంక్షోభం నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో పర్యటిస్తున్నారు. దేశంలో నాలుగేళ్ల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన తరుణంలోనే ఈ పర్యటన జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్ ఇంధన భద్రతను పటిష్ఠం చేసుకోవడం, ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.

అబుదాబిలో యూఏఈ అధ్యక్షుడు మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ప్రధాని మోదీ ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధన భద్రత, రక్షణ సహకారం, ప్రజా సంబంధాలు వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. ముఖ్యంగా ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ), వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలకు సంబంధించి రెండు ముఖ్యమైన అవగాహన ఒప్పందాలపై (ఎంఓయూ) సంతకాలు జరిగాయి. వీటితో పాటు ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌పైనా అంగీకారానికి వచ్చారు. గుజరాత్‌లోని ద్వారక జిల్లా వడినార్‌లో షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించిన ఎంఓయూపైనా సంతకాలు చేశారు. ఈ ఒప్పందాలతో పాటు భారత మౌలిక సదుపాయాలు, ఆర్‌బీఎల్ బ్యాంక్, సమ్మాన్ క్యాపిటల్‌లో 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు యూఏఈ ప్రకటించింది. ఇది భారత్ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిస్తుందని భావిస్తున్నారు. ఈ పర్యటన సందర్భంగా అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో యూఏఈపై ఇరాన్ జరిపిన దాడులను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. గల్ఫ్ ప్రాంతంలో భారత్‌కు కీలక భాగస్వామిగా ఉన్న యూఏఈతో ఈ తాజా ఒప్పందాలు వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను కొత్త శిఖరాలకు చేర్చనున్నాయి. సుమారు 45 లక్షల మందికి పైగా భారతీయులు నివసిస్తున్న యూఏఈలో వారి సంక్షేమం గురించి కూడా ఈ పర్యటనలో చర్చకు వచ్చింది. ప్రస్తుత సంక్షోభ సమయంలోనూ యూఏఈ భారత్‌కు అత్యంత నమ్మకమైన ఇంధన భాగస్వామిగా కొనసాగుతుండటం గమనార్హం.

# 'చేప ప్రసాదం' కోసం సిద్ధమవుతున్న హైదరాబాద్

హైదరాబాద్‌లో ఏటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగే 'మృగశిర కార్తె చేప ప్రసాదం' పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈ ఏడాది జూన్ 8వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ ప్రియాంక, బత్తిన కుటుంబ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ఈ కార్యక్రమానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని మంత్రి పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ మేనేజ్మెంట్, క్యూ లైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దశాబ్దాలుగా బత్తిన గౌడ్ కుటుంబం ఈ చేప ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఉబ్బసం, ఇతర శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారికి ఇది గొప్ప ఉపశమనాన్ని ఇస్తుందని భక్తుల నమ్మకం. ఒక చిన్న బతికున్న చేప పిల్ల నోటిలో మూలికా మిశ్రమాన్ని ఉంచి, దానిని రోగి చేత మింగిస్తారు. చేపలు తీసుకోని వారి కోసం బెల్లంతో కలిపిన ప్రత్యేక మూలికా మిశ్రమాన్ని అందిస్తారు.

## తొలకరి కబురు... ఈ నెల 26నే కేరళకు రుతుపవనాలు

- మొదటి పేజి తరువాయి

సాధారణంగా జూన్ 1న కేరళను తాకే రుతుపవనాలు, ఈసారి ఐదు రోజులు ముందుగా, అంటే మే 26నే తీరాన్ని తాకే అవకాశం ఉందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం, ఈ తేదీకి నాలుగు రోజులు అటూఇటూగా రుతుపవనాలు కేరళలో ప్రవేశించవచ్చు. అంటే మే 22 నుంచి మే 30 మధ్య ఎప్పుడైనా నైరుతి రుతుపవనాల రాక ఉండొచ్చని అర్థం చేసుకోవాలి. రుతుపవనాల ఆగమనంతో ప్రస్తుతం దేశవ్యాప్తంగా నమోదవుతున్న తీవ్ర ఉష్ణోగ్రతల నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది. వేసవి కాలం ముగిసి, వర్షాకాలం ప్రారంభానికి ఇది సూచికగా నిలుస్తుంది. ఐఎండీ 2005 నుంచి కేరళలో రుతుపవనాల ప్రవేశ తేదీపై అంచనాలను వెలువరిస్తోంది. ఇందుకోసం దేశీయంగా అభివృద్ధి చేసిన అత్యాధునిక స్టాటిస్టికల్ మోడల్‌ను ఉపయోగిస్తోంది. వాయువ్య భారతదేశంలో కనీస ఉష్ణోగ్రతలు, ద్వీపకల్పంలో రుతుపవనాలకు ముందు కురిసే వర్షపాతం, ఆగ్నేయ హిందూ మహాసముద్రంలోని గాలుల వేగం సహా మొత్తం ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అంచనాను రూపొందిస్తారు. గత 21 సంవత్సరాలుగా (2005-2025) ఐఎండీ విడుదల చేసిన అంచనాలు దాదాపుగా కచ్చితంగా ఉన్నాయి. కేవలం 2015లో మాత్రమే అంచనా తప్పింది. గత ఆరేళ్ల గణాంకాలను పరిశీలిస్తే, వాస్తవ తేదీకి, అంచనా తేదీకి కేవలం ఒకటి రెండు రోజుల తేడా మాత్రమే ఉండటం ఈ మోడల్ కచ్చితత్వానికి నిదర్శనం. ఈ నేపథ్యంలో తాజా అంచనా కూడా నిజమై, దేశ ప్రజలకు, ముఖ్యంగా రైతులకు సకాలంలో ఊరట లభిస్తుందని అందరూ ఆశిస్తున్నారు.

## చంద్రబాబు సంచలన నిర్ణయం... కేవలం ఆన్ లైన్ లోనే మహానాడు!

- మొదటి పేజి తరువాయి

ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పుడు మహానాడును ఆన్ లైన్ లో హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని ప్రకటించడం ద్వారా ఆ పొదుపు చర్యలను మరింత ముందుకు తీసుకెళ్లారు. ఆన్ లైన్ లో మహానాడును ఈ నెల 27, 29 తేదీల్లో నిర్వహించనున్నారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ లో ఒక వేదిక నిర్మించి దానిపై పొలిట్ బ్యూరో సభ్యులు ప్రసంగించనున్నారు. ఈ హైబ్రిడ్ మహానాడు కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,845 క్లస్టర్లలో ఎలక్ట్రానిక్ స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ భవన్ నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయనున్నారు.

## పోక్సో కేసులో.. కానిస్టేబుల్ కు 30 ఏళ్ల జైలు శిక్ష

- మొదటి పేజి తరువాయి

ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. వివరాల్లోకి వెళితే..

హైదరాబాద్ సిటీ పరిధిలోని బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ లో నమోదైన మైనర్ పై కానిస్టేబుల్ అత్యాచారం కేసులో శుక్రవారం (మే15) పోక్సో స్పెషల్ కోర్టు తీర్పు చెప్పింది. ఈ కేసులో నిందితుడైన కానిస్టేబుల్ వరదరాజ్ సుదేశ్ ను పై నమోదు అత్యాచారం కేసులో నేరం రుజువు కావడంతో పోక్సో ప్రత్యేకకోర్టు వెల్లడించింది. కానిస్టేబుల్ వరదరాజ్ సుదేశ్ కు 30 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ12వేల జరిమానా విధించింది. బాధితురాలికి 1లక్ష రూపాయలు పరిహారంగా ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

## గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో ఏపీ.. పవన్ కల్యాణ్ ప్రశంసలు

ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ డిఫెన్స్ మ్యాప్‌లో నిలిపే దిశగా రూ. 15,803 కోట్ల భారీ పెట్టుబడితో కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా ప్రాజెక్టులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఏపీ పారిశ్రామిక చరిత్రలోనే ఇదొక చారిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు.

శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో ఏర్పాటు కాబోతున్న 'ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ అండ్ ఫ్లైట్ టెస్ట్ సెంటర్' దేశ రక్షణలో కీలకం కానుంది. స్వదేశీ సాంకేతికతతో తయారవుతున్న ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం 'ఆమ్కా' ప్రాజెక్టులో ఏపీ భాగస్వామ్యం కావడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రధాని మోదీ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత బలాన్ని చేకూరుస్తుందని తెలిపారు. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో సుమారు 7,500 మంది యువతకు హై-వాల్యూ టెక్నాలజీ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కేవలం విమానాల తయారీ మాత్రమే కాకుండా, రాష్ట్రంలో అత్యాధునిక 'డ్రోన్ ఎకోసిస్టమ్'ను అభివృద్ధి చేయడం ద్వారా డ్రోన్ టెక్నాలజీలో కూడా ఏపీ అగ్రగామిగా నిలవబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని పవన్ కొనియాడారు. ఈ భారీ ప్రాజెక్టు ఏపీకి రావడానికి సహకరించిన ప్రధాని మోదీకి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## వాళ్లు ముగ్గురు 75 ఏళ్ల కుర్రాళ్లు... వాళ్లది పవర్ ఫుల్ కాంబో

- మొదటి పేజి తరువాయి

అంటూ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వారి వయసు 75 ఏళ్లయినా, వారిలో 25 ఏళ్ల యువకులు ఉన్నారని, వారి స్పీడ్ చూస్తుంటే తనకు ఆశ్చర్యం వేస్తుందని అన్నారు. ఈ ముగ్గురి వేగాన్ని తట్టుకోవడం ఎవరి వల్లా కాదని లోకేష్ వ్యాఖ్యానించారు. వీరిది పవర్ ఫుల్ కాంబినేషన్ అని కొనియాడారు.

పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టు భూమిపూజ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో కలిసి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్ర మారబోతోందని లోకేష్ అన్నారు. రక్షణ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు రానున్నాయని, యువత ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, పాకిస్థాన్‌కు గట్టి జవాబిచ్చిన 'ఆపరేషన్ సిందూర్'ను గుర్తుచేస్తూ, దాని వెనుక ఉన్న అసలైన శక్తి, ఐరన్ మ్యాన్ కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ అని లోకేష్ ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా ఏపీ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# లింగంపర్తి లో పల్లెనిద్ర లో ఏలేశ్వరం ఎస్ఐ.





**ఏలేశ్వరం, పెన్ పవర్, మే 15:** మండల పరిధి లింగంపర్తి గ్రామంలో శుక్రవారం చేపట్టిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఏలేశ్వరం ఎస్సై ఎన్ రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. లింగంపర్తి సచివాలయం వద్ద నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో స్థానికులకు క్రిమినల్, మేజర్ చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, తెలుగు యువత అధ్యక్షుడు పెంటకోట శ్రీధర్,వూర నానాజీ, పెంటకోట కృష్ణ, పెంటకోట సత్తిబాబు,పెంటకోట చిన్న,చిక్కాల అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పనులు వేగవంతం చేయాలి



**11 ఎంఎస్ఎంఈ యూనిట్లకు రూ.71.86 లక్షల రాయితీలకు ఆమోదం**

**పరిశ్రమల అనుమతులు పారదర్శకంగా, త్వరితగతిన మంజూరు చేయాలి: జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, పెన్ పవర్,మే 15:** జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో నిర్మాణంలో ఉన్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏకగవాక్ష విధానం కింద పరిశ్రమల అనుమతులు, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలకు రాయితీలు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణ పురోగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత త్రైమాసిక కాలంలో జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు సంబంధించి మొత్తం 175 దరఖాస్తులు అందాయని తెలిపారు. వీటిలో సింగిల్ డెస్క్ విధానంలో 151 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మిగిలిన 24 దరఖాస్తులు వివిధ శాఖల్లో పరిశీలనలో ఉన్నాయని, వాటిపై కూడా నిర్దిష్ట గడువులోపు నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా మరియు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని సూచించారు.చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్ రాయితీ తదితర పథకాల కింద జిల్లాలోని ఉత్పాదన, సేవారంగాలకు చెందిన 11 యూనిట్లకు రూ.71,86,191 విలువైన రాయితీ ప్రయోజనాలను మంజూరు చేయడానికి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి ఒక ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ మంజూరు చేసిందని, వీటి నిర్మాణ పనులను అధికారులు ప్రత్యేక దృష్టితో పర్యవేక్షించి త్వరితగతిన పూర్తి చేసి అందుబాటు లోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) కింద 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణాల మంజూరుకు ప్రభుత్వం జిల్లా లక్ష్యాలు, విధివిధానాలను ఖరారు చేయాల్సి ఉందని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్. గణపతి, ఏడీ ఎస్. విజయ్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ. రమణారెడ్డి,గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ, జిల్లా అగ్నిమాపక అధికారి సీహెచ్. కృపావరం,డీటీసీ ఎన్. శ్రీధర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్‌ఎస్వీ ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మరియు ఇతర శాఖల అధికారులు, పరిశ్రమల శాఖ సిబ్బంది,వివిధ అసోసియేషన్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే బండారు పుట్టినరోజు వేడుకలు.





- చెముడులంకలో సేవా కార్యక్రమాల సందడి.
- మహిళలకు చీరల పంపిణీ.
- బాటసారులకు చలివేంద్రం ఏర్పాటు.

**ఆలమూరు, పెన్ పవర్,మే 15;**కొత్తపేట నియోజకవర్గ ప్రజల అభిమానాన్ని చూరగొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జన్మదిన వేడుకలు ఆలమూరు మండలం చెముడులంక గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సేవా కార్యక్రమాలతో సాగిన ఈ వేడుకలు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మండల పరిధిలోని 18 గ్రామాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యేకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల్లో భాగంగా 18 గ్రామాల నుంచి ఎంపిక చేసిన పలువురు మహిళలకు పెద్ద ఎత్తున చీరలు పంపిణీ చేశారు. ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న బాటసారుల కోసం ప్రత్యేకంగా చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. మండల నలుమూలల నుంచి వచ్చిన వృద్ధులు, మహిళలు, అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి ఎమ్మెల్యే సేవలను కొనియాడారు. యువత, మహిళలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొని జన్మదిన వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నిరంతరం అహర్నిశలు శ్రమిస్తున్నారని ప్రశంసించారు. గ్రామాభివృద్ధి, రహదారులు, తాగునీటి సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలులో ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన సేవా కార్యక్రమాలు గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకోగా, చెముడులంక గ్రామం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన ముఖ్య నాయకులు, ప్రముఖులు, కూటమి కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సొసైటీ కార్యాలయాన్ని సందర్శించిన గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్



**కాజులూరు, పెన్ పవర్,మే 15:** కాజులూరు మండల పరిధిలోని కోలంక సొసైటీ కార్యాలయాన్ని గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ శుక్రవారం సందర్శించారు.శిథిలావస్థకు చేరుకున్న పాత సొసైటీ భవనాన్ని తొలగిస్తున్న నేపథ్యంలో, సొసైటీ కార్యాలయాన్ని కోలంక మెయిన్ రోడ్డులో కరూర్ వైశ్య ఏటీఎం సెంటర్ పక్కన ఉన్న భవనానికి తాత్కాలికంగా మార్చారు. ఈ నూతన కార్యాలయాన్ని పరిశీలించిన మురాలశెట్టి సునీల్ కుమార్, రైతులకు మరింత మెరుగైన సేవలు అందే విధంగా శాశ్వత నూతన సొసైటీ భవనాన్ని త్వరగా నిర్మించాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు అవసరమైన సేవలు సమర్థవంతంగా అందించేందుకు ఆధునిక వసతులతో కూడిన సొసైటీ భవనం అవసరమని తెలిపారు. నూతన భవనం నిర్మాణానికి తమవంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొండా వెంకన్న, కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు,నీటి వినియోగదారుల సంఘం సభ్యుడు బొండా సముద్రయ్య, కోలంక సొసైటీ అకౌంటెంట్ బాలాంత్రపు గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి డెల్టాకు జీవం పోసిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్

మంత్రి వాసంశెట్టి సుభాష్

**అమరావతి/రామచంద్రపురం, పెన్ పవర్,మే15:**ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణం ద్వారా ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసి లక్షలాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కొనియాడారు.సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గోదావరి నదీ జలాలను సమర్థవంతంగా వినియోగించాలనే దూరదృష్టితో ధవళేశ్వరం బ్యారేజ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన మహోన్నత ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ అని పేర్కొన్నారు.ఆయన కృషి వల్లే గోదావరి పరివాహక ప్రాంతం అన్నపూర్ణగా మారి,రైతుల జీవన విధానంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు.రైతుల కష్టాలను తన కష్టాలుగా భావించి, పంటలకు నీరందించేందుకు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ అహర్నిశలు శ్రమించిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని మంత్రి సుభాష్ అన్నారు. ఆయన సేవలు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టలు కేవలం ఇంజనీరింగ్ అద్భుతాలు మాత్రమే కాకుండా, కోట్లాది మంది రైతుల జీవితాలకు భరోసానిచ్చిన జీవనాధారాలుగా నిలిచాయని మంత్రి వివరించారు. రైతాంగ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు యుగయుగాల పాటు స్మరణీయమని కొనియాడారు.
రైతాంగం కోసం జీవితాన్ని అంకితం చేసిన సర్ ఆర్థర్ కాటన్ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# తెలుగువారి గుండెల్లో తరతరాలు గుర్తుండే "దొర" కాటన్.

డిసి చైర్మన్ మెర్ల గోపాలస్వామి.

**ఆలమూరు, పెన్ పవర్,మే 15;**తెలుగువారి గుండెల్లో తరతరాలు గుర్తుంటే మహానుభావుడు కాటన్ దొరని ఆలమూరు డిసీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి అన్నారు. అపర భగీరధుడు సర్ ఆర్థర్ కాటన్ 223వ జయంతి సందర్భంగా ఆలమూరు మండలం చొప్పెల్ల తూర్పు డెల్టా ప్రధాన కాలువ లాకులు వద్ద గల కాటన్ దొర నిలువెత్తు విగ్రహానికి సమీప గ్రామ అన్నదాతలతో కలిసి గోదావరి జలాలతో అభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెర్ల మాట్లాడుతూ ధవలేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ నిర్మించక ముందు వరద మంపులతో గోదావరి రైతులు అల్లాడి పోయేవారన్నారు. తమ పూర్వీకులు రైతుక్షేత్రాల్లో కరువు కాటకాలు అనుభవించేవారన్నారు. బ్రిటిష్ ఇంజనీర్ గా మన దేశానికి వచ్చిన కాటన్ దొర ఇక్కడ పుట్టలేదని, ఇక్కడ పెరగలేదని, ఉద్యోగం అంటూ వచ్చి ఊర్లన్నీ తిరుగుతూ, ఊర్లలోని వారిని చూసి అన్నము లేక అలమటిస్తున్న అభాగ్యుల ఆక్రందనలు విని, బీడువారిన భూములను చూసి, మట్టి వాసనను చూసి,మాణిక్యాలు పండుతాయి అనుకున్నాడని, వ్యర్థంగా సముద్ర పాలవుతున్న విలువైన జలాలను పొలాలలో పారించాలనుకుని, గుర్రమెక్కి గోదావరి ప్రాంతం అంతా కొండ కోనల్లో తిరిగి ఆహర్నెసలు శ్రమించి ఈ ప్రాంతమంతా సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేసి ధవలేశ్వరం వద్ద గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి అన్నదాతల పాలిట ఆపద్బాంధవుడై అపర భగీరధుడు అయ్యాడని కొనియాడారు. కూటమి నాయకుల ఆధ్వర్యంలో భారీ కేకును కట్ చేసి స్థానిక ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శేఖరకన్నా, ఐసీ అసిస్టెంట్ కే శ్రీను, ఓఎస్ బి మెహర్, ఎన్ శివ సురేష్, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## అభివృద్ధి కృషీవలుడు గిడ్డి సత్యనారాయణ జన్మదిన వేడుకలు



**అంబాజీపేట, పెన్ పవర్, మే 15:** పి. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ 62 వ పుట్టినరోజు కార్యక్రమాన్ని స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న డా.బిఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద గిడ్డి పోలవర్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథం లో నడిపిస్తూ అభివృద్ధి లో రాష్ట్రము లో 8 వ స్థాన్నాని, జిల్లా లో మొదటి స్థానం లో నిలిపిన ఘనత ఎమ్మెల్యే దే అని నాయకులు కొనియాడారు. కులామతాలకు అతీయతంగా. పార్టీలకు అతీయుతంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి లో నిలిపారని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే గ సోదరుడు గిడ్డి ఆనంద్,
పులిదిండి వీర వెంకట సత్యనారాయణ, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, కత్తుల బాబులు, నాగవరపు అన్నవరం, సత్యాల కొండల రావు, నెల్లి వెంకటరమణ, నెల్లి చిన వెంకటేశ్వర్రావు, మూలపర్తి రమేష్, చింత రత్నరాజు, ఒరిగంటి వెంకటరావు, మట్ట వెంకటేశ్వరరావు,కొక్కిరి రవి, కుసుమ శ్రీకాంత్, కోట మురళి, మోకా శ్రీను, నేలపూడి రవి, గిడ్డి రాజారత్నం, గిడ్డి బాలు, నెల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాలి సచివాలయంలో కిశోరి వికాసం అవగాహన కార్యక్రమం



**ఆత్రేయపురం పెన్ పవర్ మే 15:**ఆత్రేయపురం మండలం కొత్తపేట ప్రాజెక్టు పరిధిలోని ర్యాలి సచివాలయంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 1 మే 2026 నుండి మనేది వ లెరేఖ వరకు ప్రతి మంగళవారం, శుక్రవారం రోజుల్లో ప్రతి సచివాలయం పరిధిలో కిశోర బాలబాలికలకు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.
ఈ కార్యక్రమానికి సిడిపిఓ ఎ. గజలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కిశోర బాలబాలికలు విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. సమాజంలో పెరుగుతున్న బాల్య వివాహాలు, అక్రమ రవాణా వంటి సామాజిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బాలల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పోక్స్ చట్టం గురించి క్లుప్తంగా వివరించి, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.
కార్యక్రమంలో బాలబాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, విద్య ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు ధైర్యంగా ముందుకు సాగి తమ లక్ష్యాలను సాధించాలని అధికారులు ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కె. పద్మావతి, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది మరియు కిశోర బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు స్థానికులు అధికారులను అభినందించారు.

## ఆదిత్య లో ఎ.పి.ఈ.ఎ.పి సెట్ - 2026 ఎగ్జామ్స్ సెంటర్ ను పరిశీలించిన జె.ఎన్.టి,యు.కె. వి.సి





**గండేపల్లి, పెన్ పవర్, 15:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఎ పి ఈ ఎ పి సెట్ -2026 ఆన్లైన్ ఎగ్జామ్స్ నాల్గవ రోజు ప్రశాంతంగా ముగిసినట్లు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డా. ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నాల్గవరోజు ఎగ్జామ్ సెంటర్ ను జె.ఎన్.టి.యు.కె. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్.సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆదిత్య కు విచ్చేసిన వైస్ ఛాన్సలర్ కు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా.ఎన్. సతీష్ రెడ్డి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి.శ్రీనివాస్ లు సాదర స్వాగతం పలికారు. ఆదిత్య యూనివర్సిటీ క్యాంపస్ లో ఉదయం 9-00 నుంచి 12-00 వరకు నిర్వహించిన 253 గాను 243 హాజరు కాగా 10 మంది హాజరు కాలేదు. అదేవిధంగా మధ్యాహ్నం 2-00 నుండి 5-00 గంటల వరకు నిర్వహించిన 252 మందికి గాను 248 మంది హాజరు కాగా 4 గురు హాజరు కాలేదు. ఈ ఆన్లైన్ ఎగ్జామ్స్ ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆదిత్య యూనివర్సిటీ పూర్తి ఏర్పాట్లను చేసింది. బస్సు ల ద్వారా బ్యాటరీ వెహికల్స్ ద్వారా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఎగ్జామ్స్ కు చీఫ్ సూపరింటెండ్ గా ఆదిత్య ప్రో. వైస్ ఛాన్సలర్ డా. ఆదిరెడ్డి రమేష్ వ్యవహరించగా, డా.పి.శివ సత్యప్రసాద్, ప్రో.టి.శ్రీనివాసులు, ప్రో.వీర ప్రసాద్ కో.ఆర్డినేటర్లు గా వ్యవహరించారు.

# ఆత్రేయపురంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పుట్టినరోజు వేడుకలు





**రక్తదాన శిబిరం.. ప్రత్యేక పూజలు.. భారీ కేక్ కట్‌తో సందడి**

**ఆత్రేయపురం పెన్ పవర్ మే 15:**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పుట్టినరోజు సందర్భంగా ఆత్రేయపురం మండలంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు చేపట్టి సంబరాలు జరిపారు.ముందుగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణ రాజు, వాడపల్లి దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, అనపర్తి నియోజకవర్గ పరిశీలకులు ఆకుల రామకృష్ణ తదితరులు కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పేరుమీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో ప్రజలకు మరింత సేవ చేయాలని ప్రార్థనలు చేశారు.
అనంతరం లొల్లలాకుల వద్దకు చేరుకున్న నాయకులు బ్రిటిష్ ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ట్రస్ట్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 62 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు రామకృష్ణరాజు సైతం రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు.
ఇదే సందర్భంగా ప్రజలకు తాగునీరు అందించేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యకర్తల కోలాహలం మధ్య భారీ కేక్ కట్ చేసి ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలను ఉత్సాహంగా జరిపారు. పలువురు నాయకులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కూసంపూడి రామకృష్ణరాజు మాట్లాడుతూ గత రెండేళ్లలో ఆత్రేయపురం మండల అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు విశేష కృషి చేశారని కొనియాడారు. వాడపల్లి దివ్యక్షేత్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. లొల్లలాకుల పునర్నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేయించారని గుర్తుచేశారు. వసంతవాడ వద్ద నాలుగు నియోజకవర్గాలకు తాగునీరు అందించే అమరజీవి జలధార పనులకు శంకుస్థాపన చేయడం అభినందనీయమన్నారు. డ్రాగన్ పడవల పోటీల నిర్వహణ ద్వారా ఆత్రేయపురం పేరు రాష్ట్రవ్యాప్తంగా మారుమోగేలా చేశారని పేర్కొన్నారు.
కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన వారందరికీ భోజన ఏర్పాట్లు చేశారు.





## పీజీఈసెట్, జీప్యాట్ & క్యాట్ - 2026 లో ఆదిత్య ఫార్మసీ కళాశాలల విద్యార్థుల ప్రతిభ





**గండేపల్లి, పెన్ పవర్, మే 15:**గండేపల్లి మండలం సూరంపాలెం లో ఆదిత్య ఫార్మసీ విద్యాసంస్థల విద్యార్థులు ఎం.ఫార్మసీ కోర్సులో ప్రవేశం కొరకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పీజీఈసెట్ 2026 లో, జాతీయ స్థాయిలో నిర్వహించిన జీప్యాట్ మరియు క్యాట్ 2026 లో ఉత్తమ ఫలితాలు సాధించారని ఆదిత్య విశ్వవిద్యాలయం డిప్యూటీ ప్రో-చాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు
యేగి శిరీష పీజీఈసెట్ లో రాష్ట్ర స్థాయిలో 26వ ర్యాంక్ సాధించగా, తెలగారెడ్డి శ్రీవల్లి 106వ ర్యాంక్ సాధించింది. వీరిద్దరూ జాతీయ స్థాయిలో నిర్వహించిన జీప్యాట్ పరీక్ష లో కూడా అర్హత సాధించి స్కూల్ ఆఫ్ ఫార్మసీ సత్తా ను మరొక సారి చాటారు. మొత్తంగా 53 మందికి పైగా విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్థాయిలో నిర్వహించిన పీజీఈసెట్ 2026 లో ర్యాంకులు సాధించగా, జాతీయ స్థాయిలో నిర్వహించిన జీప్యాట్ లో ముగ్గురు(3) మరియు క్యాట్లో ఒక (1) విద్యార్థి అర్హత సాధించారు.ఈ సందర్భంగా ఆదిత్య విశ్వవిద్యాలయం, ప్రో-చాన్సలర్, డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి , విద్యార్థులను అభినందిస్తూ, వారి కృషి, తల్లిదండ్రుల సహకారం మరియు అధ్యాపకుల మార్గదర్శకత్వం ఈ విజయానికి కారణమని తెలిపారు.స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ డాక్టర్ డి. సతీష్ కుమార్ మరియు ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె రవి శంకర్ విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## వి.కె.రాయపురం లో "బడి పిలుస్తుంది"






**కార్యక్రమం ద్వారా పలువురు విద్యార్థులు చేరిక**

**గండేపల్లి, పెన్ పవర్, మే 15:** వీకే రాయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలు సంయుక్తంగా "బడిపిలుస్తుంది" కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టడం జరిగింది. ప్రతీ ఇంటికి వెళ్లి 5 సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్చమని, అనేక సౌకర్యాలు కల్పించడం తో పాటు డిజిటల్ ఎడ్యుకేషన్ కూడా ప్రభుత్వం అందిస్తూ ఉన్నత ఫలితాలు సాధిస్తున్న సర్కారు బడిలో తమ పిల్లలను చదివించమని తల్లి తండ్రులను కోరారు. ఈ డ్రైవ్ లో పలువురు విద్యార్థులు పాఠశాలలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మురళీ కృష్ణ, వీకే రాయపురం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు నారాయణ, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె . శ్రీనివాస్, జె. రమణమ్మ,తోటకూర వి వి సత్యనారాయణ మరియు ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించండి -ఎంఈఓ నాయక్

**గండేపల్లి, పెన్ పవర్, మే 15:**ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించాలంటూ శుక్రవారం స్థానిక ఎం ఈ ఓ నాయక్ విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. బడి పిలుస్తోంది లో భాగంగా ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు కలిసి గృహ సందర్శన చేశారు
ఈ సందర్భంగా ఎంఈఓ నాయక్ మాట్లాడుతూ మండలంలోని మూడు క్లస్టర్లో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సౌపాధ్యాయులు ... ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులను చేర్చి ఉన్నారు . తాళ్లూరు ,
నీలాద్రి రావు పేట ,ఓ రాగం పేట, సూరంపాలెం గ్రామాల్లో మండల విద్యాశాఖ అధికారులు కేహెచ్ నాయక్ మరియు కే వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు మల్లేపల్లి మరియు నాయకంపల్లి వారి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది ..
ఇందులో భాగంగా ఈరోజు 5 మంది అంగన్వాడి మరియు 6 ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ అయినారు ..





ముఖ్యంగా ప్రభుత్వం మన ప్రభుత్వ పాఠశాలలో అమలు చేయుచున్న కార్యక్రమాలు విద్యార్థి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ ఈ కార్యక్రమం జరిగింది ప్రతిరోజు కూడా మండలంలో అన్ని క్లస్టర్స్ లో ఈ కార్యక్రమాన్ని జరుపుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు చేరే విధంగా మండల విద్యాశాఖ రోజువారి ప్రణాళిక అమలు అమలు చేయాలని ఇట్లు ఎంఈఓ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులతోపాటు అంగన్వాడీ కార్యకర్తలు వై వి లక్ష్మి, చిన్నారి, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాల మధ్య ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జన్మదిన వేడుకలు





**కొత్తపేట, పెన్ పవర్, మే15:**కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు 62వ జన్మదిన వేడుకలను కొత్తపేట మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పది గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు.బస్టాండ్ సెంటర్ వద్ద కేక్ కటింగ్ నిర్వహించి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలు, రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేయడంతో పాటు చంటి పిల్లలకు ఉయ్యాలలు, ఆక్సిజన్ సిలిండర్ అందజేశారు. ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని అన్న క్యాంటీన్‌లో ఉచిత అల్పాహారం, భోజనం వితరణ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజాసేవలో నిరంతరం ముందుంటూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు.


02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## మంత్రి నారా లోకేష్ పర్యటన ప్రాంతాలను, ఏర్పాట్లను పరిశీలించిన నేతలు, అధికారులు









**, గండేపల్లి, పెన్ పవర్, మే 15** రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఈనెల 18, 19 తేదీల్లో జగ్గంపేట నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను ఈరోజు సంబంధిత నేతలు, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

లోకేష్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవితేజతో కలిసి స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీ తిలక్, ఇరిగేషన్ ఈఈ రాజేశ్వరావు, సీఏ తిరుపతిరావు తదితరులు పర్యటన జరిగే ప్రాంతాలను సందర్శించారు.

పరిశీలించిన ప్రాంతాలు:

1. రాత్రి బస ప్రదేశం: లోకేష్ రాత్రి బస చేసే పరిణయం ఫంక్షన్ హాల్‌ను పరిశీలించి భద్రత, సౌకర్యాలపై అధికారులకు సూచనలు చేశారు.
2. రైతులతో ముఖాముఖి రైతులతో సమావేశం నిర్వహించే పామాయిల్ తోటను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు.
3. తాళ్లూరు లిఫ్ట్ శంకుస్థాపన స్థలం: రూ. 52 కోట్లతో నిర్మించనున్న తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ శంకుస్థాపన చేయనున్న ప్రదేశానికి వెళ్లి జరుగుతున్న పనులు, పైలాన్ నిర్మాణ పనులను పరిశీలించారు. అదే ప్రాంతంలో నిర్వహించే బహిరంగ సభకు అనువైన స్థలాన్ని కూడా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, "మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేసేందుకు పోలీస్ శాఖ, లోకేష్ ప్రోగ్రాం కమిటీ సభ్యులతో కలిసి ప్రతి ఏర్పాటును క్షుణ్ణంగా పరిశీలించాం. రైతుల సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధికి ఈ పర్యటన దోహదపడుతుంది" అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, పాంద్రంగి రాంబాబు, మండపాక అప్పన్న దొర, వేములకొండ జోగారావు, పిల మహేష్, దాపర్తి సీతారామయ్య, నలమాటి ఆనంద్, గండేపల్లి ఎండిఓ హరికృష్ణ సత్యారెడ్డి, గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి ఎస్సైలు శివనాగబాబు, రఘునాథరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ఇదేనా ?

- అభివృద్ధి పేరుతో సిమెంట్ రోడ్డు తవ్వారు..
- అలానే వదిలేసారు..

**అంబాజీపేట, పెన్ పవర్, మే 15:**గ్రామాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నా నాయకులు, అధికారులు ఆదిశగా అడుగులు వేయడంలేదని ప్రజలు మండిపడుతున్నారు.

అభివృద్ధి పేరుతో ఉన్న సిమెంట్ రోడ్డు పై సెంటర్ డ్రైనేజీ నిర్మించేందుకై సిమెంట్ రోడ్డుని అడ్డంగా వదిలేసారని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. మండలంలోని మాచవరం గ్రామపంచాయితీ పరిధి స్త్రీల ఆసుపత్రి వద్ద ఉన్న దొమ్మేటివారి పాలెంలోని దుస్థితి ఇది. పంచాయితీ సర్పంచులు పదవీకాలం ముగుస్తున్న చివరి దశలో అభివృద్ధి పేరుతో హడావుడిగా మొదలైన ఈ డ్రైనేజీ పనులు ఆరంభంలోనే ఆగిపోయాయి. ఇలా గోతులు తవ్వి వదిలేయడంతో రెండునెలలుగా చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానిక నివాసులు వాపోతున్నారు. పలుమార్లు పిల్లలు, వృద్దులు ఈ గోతిలో పడ్డ సందర్భాలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ రోడ్డులో వాహనాలు నడిపేందుకు వీలులేక అవస్తలు పడుతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యని పరిస్కరించాలని కోరుతున్నారు.

## కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు 62వ జన్మదిన వేడుకలు

అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న ఎమ్మెల్యేకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రజలు





**ఆత్రేయపురం పెన్ పవర్ మే 15:**ర్యాలి గ్రామంలో బండారు సత్యానందరావు 62వ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు పేర్చర్ల పుల్లంరాజు వర్మ అధ్యక్షతన, గ్రామ టీడీపీ అధ్యక్షులు పెండెం వెంకన్న సమక్షంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద భారీ కేకులు ఏర్పాటు చేసి కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు.

పార్టీ నాయకులు, అభిమానులు కలిసి కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మంత్రి పదవి చేపట్టి కొత్తపేట నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనంతరం ర్యాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పేషెంట్లకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి




**జగ్గంపేట, పెన్ పవర్, మే 15:** ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్న వేళ ఇప్పుడు దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం ప్రజలకు మరో భారీ దెబ్బగా మారిందని ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలకు నిరసనగా శుక్రవారం జగ్గంపేట మండలం రంగవల్లి నగర్ లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ వాహనం బయటకు తీస్తే చాలు జేబు ఖాళీ అవుతోందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఈ పెరిగిన ధరలు వెంటనే అమలులోకి రావడంతో అర్ధరాత్రి నుంచే దేశంలోని అనేక పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరిన దృశ్యాలు కనిపించాయి. ఇంకా ఎంత భారం మోపుతారు అంటూ ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమలో రంగవల్లి నగర్ నాయకులు డాన్ శీను, సోమరాజు, మంగయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యాభ్యాసం పై శ్రద్ధ వహించాలి -ఎంఈఓ నాయక్





**గండేపల్లి, పెన్ పవర్, మే 15:**విద్యార్థులు విద్యాభ్యాసంపై శ్రద్ధ వహించాలని గండేపల్లి విద్యాశాఖ అధికారి నాయక్ తెలిపారు. శుక్రవారం మండల పరిధి తాళ్లూరు హై స్కూల్ నందు సప్లమెంటరీ పరీక్షల కోసం ప్రత్యేక విద్యాబోధన పొందుతున్న విద్యార్థులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మండలంలోని ఆరు కాంప్లెక్స్ గాను 82 మంది విద్యార్థులు సప్లమెంటరీ కి మిగిలారని ఇందులో 42 మంది సైన్స్ లో ఫెయిల్ అవ్వడం జరిగిందన్నారు. సంక్రాంతి తర్వాత 100 రోజుల ప్రాణాలికతో 10వ తరగతి విద్యార్థులకు అన్ని పాఠశాలల్లోనూ ప్రత్యేక విద్యాబోధన అందించడం జరిగిందని ఆ విద్యా బోధనలో వెనకబడిన వారు మాత్రమే పూర్తిస్థాయిలో పరీక్షలు రాయలేకపోయారన్నారు. ఈనెల 25వ తారీఖున జరగబోయే సప్లమెంటరీకి పూర్తిస్థాయిలో విద్యార్థులు ఉపాధ్యాయులు అందించే విద్యాబోధనలను అలవర్చుకుని పరీక్షల రాసేందుకు సిద్ధం కావాలని తద్వారా పరీక్షలలో పూర్తి ఫలితాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులు తో మాట్లాడుతూ సప్లమెంటరీ విద్యార్థులు ప్రత్యేక బోధనకు రాని యెడల వారి తల్లిదండ్రులతో మాట్లాడి రప్పించవలసిందిగా ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఆరు జడ్పీహెచ్ఎస్ స్కూల్లకు గాను బోధన అందించేందుకు ఉపాధ్యాయులు ఉన్నారని విద్యార్థులు గమనించి తప్పనిసరిగా అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నూరు శాతం మార్పులు వచ్చే విధంగా విద్యను అభ్యసించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా సేవా కార్యక్రమాలతో ఎమ్మెల్యే బండారు జన్మదిన వేడుకలు



**కొత్తపేట, పెన్ పవర్ ,మే 15:**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు జన్మదినాన్ని పురస్కరించుకొని కొత్తపేట బస్టాండ్ సెంటర్‌లో తెలుగు మహిళ నాయకురాళ్లు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు యల్లమెల్లి చంద్రకుమారి ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు చీరల పంపిణీ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు రాజకీయ, సామాజిక రంగాల్లో ప్రోత్సాహం అందిస్తూ వారి అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని నాయకురాళ్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇర్రిపాక శివకేశవుల ఆలయంలో ప్రతీ శనివారం శ్రీవారి లడ్డు ప్రసాద విక్రయం ప్రారంభం



**జగ్గంపేట, పెన్ పవర్, మే 15** : కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో ఏలేరు నది తీరాన కొలువైన పుణ్యక్షేత్రం శ్రీ భ్రమరాంబికా సమేత శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి కొలువైన శివ కేశవుల ఆలయంలో ఇకపై ప్రతి శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం వారి శ్రీవారి లడ్డు ప్రసాదం భక్తులకు అందుబాటులోకి రానుందని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ శుక్రవారం వెల్లడించారు. జగ్గంపేట రావులమ్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తిరుమల నుండి ప్రత్యేక వాహనంలో చేరుకున్న పవిత్ర లడ్డు ప్రసాదాన్ని ఆయన భక్తిశ్రద్ధలతో ప్రదర్శించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధీనంలో ఉన్న ఇర్రిపాక శివకేశవుల క్షేత్రంలో ఇకపై ప్రతి శనివారం భక్తులు తిరుమలలో లభించే అదే రేటుకు శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని ఇక్కడే పొందవచ్చన్నారు. ఈ అరుదైన అవకాశాన్ని భక్తులంతా సద్వినియోగం చేసుకుని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, ఇరిగేషన్ ఈఈ రాజేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## సిఐటియు దేశవ్యాప్తంగా ఉన్న యూనియన్..

- జిల్లా మండల బాధ్యులు సమస్యలు పరిశీలించడానికి ముందుంటారు.



**గండేపల్లి,పెన్ పవర్,మే,15:**సిఐటియు పేరుతోనే యూనియన్ కొనసాగుతుంది దానికి బాధ్యుల్ని జిల్లా నాయకత్వం నిర్ణయించింది.
వేరే యూనియన్లు ఉన్న వారి పేర్లతోనే పక్కాగా ప్రకటించుకోవాలి మండల బాధ్యులు తెలిపారు. శుక్రవారం గండేపల్లి భవన నిర్మాణ కార్మికుల భవనం నందు సిఐటి ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొత్త యూనియన్ల పేరుతో కొంతమంది జిల్లా నాయకత్వం మండల నాయకత్వం అని చెప్పుకుంటున్నారని వారు చెప్పుకోవడంలో తప్పులేదు కానీ మండలంలో ఉన్న ఆశా వర్కర్లందరూ ఒకే తాటి మీద ఉన్నామని ఒకరిద్దరూ కొత్త యూనియన్ల పేరుతో హల్చల్ చేయడం సరైనది కాదని వారు కోరారు ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు కారి శాంతి మండల కన్వీనర్ నొక్కు లలిత కోశాధికారి పోతుల విష్ణు లక్ష్మి పత్రిక ముఖంగా మాట్లాడుతూ
ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియుగా దేశవ్యాప్తంగా ఉన్నది మన రాష్ట్రంలో 42 వేలమంది సిఐటియుసంఘం ఆశా వర్కర్స్ యూనియన్ రిజిస్ట్రేషన్ నెంబర్ హెచ్ 102 సభ్యులుగా ఉన్నారు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4500 మంది సిఐటియు సభ్యులుగా ఉన్నారు ఇప్పుడు కాకినాడ జిల్లా మొత్తంగా 21 మండలాల్లో ఆశ వర్కర్లందరూ 1450 మంది ఉన్నారు వీరంతా సిఐటియు సభ్యత్వం కట్టి సభ్యులుగా ఉన్నారు సిఐటియులో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి మహాసభలు జరుపుకుంటూ నాయకత్వాన్ని ఆ మహాసభల ద్వారా ఎన్నుకోవడం జరుగుతుంది కాకినాడ జిల్లా మహాసభ 2025 నవంబర్ 29వ తేదీన సుందరయ్య భవనంలో జరిగింది ఈ మహాసభలో కాకినాడ జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా రాయుడు నాగలక్ష్మి గౌరవ అధ్యక్షులుగా బేబీ రాణి ప్రధాన కార్యదర్శిగా చంద్రమళ్ళ పద్మ జిల్లా కోశాధికారిగా నొక్కు లలిత ఆఫీస్ బేరర్స్ గా మడికి లక్ష్మి, మద్దెల భారతీప్రియ, చెక్కల వేణి, ముప్పిడి ఆశాజ్యోతి, లంక దుర్గాదేవి, మర్యారత్నం నెట్ల ఉమాదేవి వీరంతా ఆఫీస్ బ్యాలెన్స్ గాను కమిటీ సభ్యులుగా 21 మంది ఎన్నుకోబడ్డారు ఏ సమస్య వచ్చినా ప్రతినెల ఆఫీస్ బ్యాలెన్స్ జిల్లా కమిటీ సభ్యులు కమిటీల్లో చర్చించి నిర్ణయాలు తీసుకుంటూ ప్రజాస్వామ్యబద్ధంగా ఈ ఆశా వర్కర్స్ యూనియన్ ని నడిపించడానికి కృషి చేస్తున్న రు

## ఎమ్మెల్యే బండారు జన్మదినాన్ని సేవా దినోత్సవంగా నిర్వహించిన కంఠంశెట్టి



**కొత్తపేట, పెన్ పవర్, మే15;**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం బోడిపాలెంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కంఠంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు దాహార్తిని తీర్చడానికి చల్లని మజ్జిగ,తాగునీరు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బండారు రాజకీయ ప్రస్థానంలో తొలి నుంచీ అండగా నిలుస్తూ, ఆయన విజయానికి ప్రముఖ పాత్ర పోషించిన నాయకుడిగా కంఠంశెట్టి శ్రీనివాసరావుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. క్రింది స్థాయి కార్యకర్తలతోనూ,స్థానికప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎమ్మెల్యే ఆశయాలను గ్రామ స్థాయిలో ప్రజలకు చేరవేస్తున్నారని స్థానికులు అభినందించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్న ప్రజానాయకుడని, ఆయన నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాలూరి సత్యనారాయణరావు, పాలూరి జయప్రకాశ్, కంఠంశెట్టి శివాజీ, చోడపిండేడి గోవిందు, సాదా శీను, కొమ్మన శివాజీ, రాంబాల సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

# అయినవిల్లి సత్తిబాబు గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు






**భవిష్యత్తులో ఉన్నత పదవులు చేపట్టాలి -- నాయకుల ఆకాంక్ష**

**రావులపాలెం పెన్ పవర్ మే 15:**కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన ప్రముఖ బీజేపీ నాయకులు అయినవిల్లి సత్తిబాబు గౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు, ఉమ్మడి కూటమి కార్యకర్తలు, బీసీ నాయకులు ఆయన నివాసానికి చేరుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
పార్టీకి క్రమశిక్షణతో సేవలందిస్తూ, కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా సత్తిబాబు గౌడ్ ప్రత్యేక గుర్తింపు పొందారని నాయకులు పేర్కొన్నారు. బీజేపీ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు కృషి చేస్తూ బీసీ వర్గాలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు.
ఈ సందర్భంగా బీసీ చైతన్య వేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, రాష్ట్ర బీసీ నాయకులు రాయుడు లక్ష్మణరావు మాట్లాడుతూ సత్తిబాబు గౌడ్ పార్టీకి వీరవిధేయుడిగా పనిచేస్తూ నాయకత్వ లక్షణాలను చాటుకుంటున్నారని అన్నారు. కొత్తపేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉమ్మడి కూటమి నాయకత్వాన్ని సమన్వయం చేస్తున్నారని తెలిపారు.
బీసీ వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని, కార్యకర్తలందరికీ ఆత్మీయుడిగా ఉంటూ పార్టీ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.
జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు పండ్లు, ఆహార పదార్థాలు అందజేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కూటమి నాయకులు, బీజేపీ కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏవీ నగరంలో 5వ దశ రీ సర్వే పనుల పరిశీలన

**పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశం**



**కాకినాడ/తొండంగి, పెన్ పవర్,మే 15** :తొండంగి మండలం ఏవీ నగరంలో జరుగుతున్న 5వ దశ రీ సర్వే పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ శుక్రవారం రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి పరిశీలించారు. రీ సర్వే ప్రక్రియలో భాగంగా చేపడుతున్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులను పరిశీలించిన జేసీ, అక్కడి రైతులతో నేరుగా మాట్లాడి సర్వే జరుగుతున్న తీరుపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, కాకినాడ జిల్లాలోని 34 గ్రామాల్లో 5వ దశ రీ సర్వే పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా అత్యంత పారదర్శకంగా రీ సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ముందుగా నోటీసులు జారీ చేసిన తరువాతే గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ పనులు చేపట్టాలని సూచించారు. ఈ-కేవైసీ పూర్తయిన అనంతరం డ్రాఫ్ట్ పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేసి, వారి భూమి వివరాలను నిర్ధారించిన తర్వాతే తుది పట్టాదారు పాస్ పుస్తకాల ముద్రణ చేపట్టాలని స్పష్టం చేశారు. పెద్దాపురం డివిజన్ పరిధిలోని తొండంగి మండలం ఏవీ నగరం గ్రామంలో మొత్తం 6364.59 ఎకరాల విస్తీర్ణంలో 5వ దశ రీ సర్వే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు 1033 ఎకరాల్లో రీ సర్వే పూర్తయిందని వెల్లడించారు. రెవెన్యూ, సర్వే అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ సర్వే నిర్వహించాలని సూచించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ 516 జాతీయ రహదారి నిర్మాణ పనులను కూడా సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కె. వీరేష్, రీ సర్వే డీటీ ఎం. శ్రీనివాసు, మండల మరియు గ్రామ సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిల్లంగి కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా ప్రదోష పూజలు

**-మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు**





**కిర్లంపూడి, పెన్ పవర్, మే 15:** కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామంలో వేంచేసియున్న శ్రీ శ్ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో వైశాఖ బహుళ త్రయోదశి,చతుర్దశి సందర్భంగా ప్రదోష పూజలు,మాస శివరాత్రి పూజలు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు,అర్చకులు వెంకట శాస్త్రి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ప్రదోషకాలంలో నందీశ్వర స్వామివారికి విశేష పంచామృతాభిషేకం,పుష్పార్చన ,బిల్వార్చనతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం వైశాఖ బహుళ చతుర్దశి మాస శివరాత్రి సందర్భంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం,21 రకాల అభిషేక ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకం వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు గ్రామ ప్రజలు, శివభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అభిషేకాలను తిలకించి దివ్య దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి పరమేశ్వరుని అనుగ్రహం పొందారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు,ఆలయ అర్చకులు వెంకట శాస్త్రి ఈ పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# జొన్నాడలో ఘనంగా ఎమ్మెల్యే బండారు పుట్టినరోజు వేడుకలు



**ఆలమూరు, పెన్ పవర్,మే15;**కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని జొన్నాడ గ్రామ యువత భావన శ్రీనివాస్, మల్లిడి సూర్యనారాయణ రెడ్డి, ననవరపు నాగరాజు, వీరి సందీప్, పట్టెం వీరబాబు ఆధ్వర్యంలో జొన్నాడ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద స్థానిక కూటమి నాయకులతో కలిసి భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ముందుగా రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద బండారు సత్యానందరావు, ఆయన కుటుంబ సభ్యులు తరపున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నిరంతరం అహర్నిశలు శ్రమిస్తున్నారని ప్రశంసించారు. గ్రామాభివృద్ధి, రహదారులు, తాగునీటి సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలులో ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గం టిఎన్టియుసి అధ్యక్షులు తాడి శ్రీనివాస్ రెడ్డి(బట్టి శ్రీను), ఎంపిటిసి మారిశెట్టి శ్రీనివాస్,ఏఎంసి డైరెక్టర్ నామాల సూరిబాబు, జొన్నాడ గ్రామ సొసైటీ అధ్యక్షులు మేడపాటి రామారెడ్డి,గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబి),గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుత్తుల పవన్ జీ, ఐటిడిపి ఉపఅధ్యక్షులు తాడి రామకృష్ణారెడ్డి,ద్వారంపూడి సతీష్ రెడ్డి,సత్తి శ్రీనివాస్ రెడ్డి,తాడి రామచంద్రారెడ్డి,వీరి గోపాలకృష్ణ, వీరి కిట్టయ్య,బీజేపీ అయినవిల్లి సత్తిబాబు గౌడ్,జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు చింతలపూడి శ్రీనివాస్, దాసరి రాంబాబు, మహిళలు,తెలుగుదేశం పార్టీనాయకులు,కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ప్రభుత్వ పాఠశాలల విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు.



ప్రభుత్వ పాఠశాలల ప్రవేశాల నమోదు ప్రక్రియలో డిఈఒ,పి రమేష్.

**కిర్లంపూడి, పెన్ పవర్, మే 15:**ప్రభుత్వ పాఠశాలల విద్యతోనే విద్యార్థులకు మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి,పి రమేష్ అన్నారు. బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా కిర్లంపూడి మండలం జగపతినగరం పంచాయతీ పరిధిలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశ నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ లు, టి జోసెఫ్ , మక్కా చిన్నారావుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుపై, పి రమేష్ ప్రత్యేక అవగాహన కల్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన విద్యాబోధన చేయడమే కాకుండా,వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు.అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం తోపాటు ,సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం ద్వారా మూడు జతల యూనిఫామ్‌లు,స్కూల్ బ్యాగ్,ఒక జత బూట్లు,రెండు జతల సాక్సులు,ఒక బెల్టు,టెక్స్ట్ పుస్తకాలు,నోటు పుస్తకాలు తదితర వస్తువులతో కూడిన కిట్లు ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు.ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.ఈ నమోదు ప్రక్రియలో 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు మొత్తం 10 మంది విద్యార్థులను వివిధ పాఠశాలల్లో చేర్పించారు. ఈ కార్యక్రమంలో మక్రా అప్పారావు మాస్టారు, గ్రామ పెద్దలు చదరం చంటిబాబు, గూడాల రాంబాబు,క్లస్టర్ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు,ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,సిఆర్పీలు,పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లు,మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి



## జనార్ధన స్వామి ఆలయానికి భక్తుల వెల్లువ



**ఆలమూరు, పెన్ పవర్,మే 15;**ఆలమూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారి ఆలయానికి శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వారికి ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు సాదర స్వాగతం పలికారు. అర్చకులు ఖండవల్లి ప్రభాకరాచార్యులు వారందరికీ స్వామివారి దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. వేల ఏళ్ల నాటి ఆలయాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందని భక్తులందరూ ఆనందం వ్యక్తం చేశారు.

## వాడపల్లి వెంకన్న బాబు ఆలయం లో భక్తుల రద్దీ

నిత్య అన్నదానానికి లక్ష రూపాయల విరాళం అందజేసిన దాతలు





**ఆత్రేయపురం పెన్ పవర్ మే 15 :**కోనసీమలో ప్రసిద్ధి చెందిన తిరుమల తిరుపతి వాడపల్లి క్షేత్రం శుక్రవారం భక్తజన సందోహంతో కళకళలాడింది. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

స్వామివారి వసంత మండపంలో అష్టోత్తర పూజలు, నిత్యా కళ్యాణం కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు కుటుంబ సమేతంగా స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు ప్రత్యేక తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్తులు విశేషంగా స్పందిస్తూ విరాళాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన కొమ్మన మణిబాబు -- శ్రీవిద్య దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి నిత్య అన్నదానానికి రూ.1,00,000 విరాళంగా సమర్పించారు. భక్తుల సేవలో భాగంగా అన్నదాన కార్యక్రమం నిరంతరం కొనసాగాలని ఆకాంక్షిస్తూ వారు ఈ విరాళం అందజేసినట్లు తెలిపారు.దాతలను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్రావు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన కార్యక్రమాలకు భక్తులు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

## నేడు పలు మండలాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం

132 కేవీ లైన్ల మరమ్మత్తుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేత



**కాజులూరు, పెన్ పవర్, మే 15:** ఏపీ ట్రాన్స్‌కో గొల్లపాలెం పరిధిలోని 132 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మత్తుల పనుల నేపథ్యంలో మే 16,శనివారం పలు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు.ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కాజులూరు, కరప, తాళ్లరేవు మరియు పెదపూడి మండలాల్లోని సంపర సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. అలాగే ఇండస్ట్రియల్ యూనిట్లు, ఆక్వా సర్వీసులకు కూడా అవసరాన్ని బట్టి విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.విద్యుత్ లైన్ల మరమ్మత్తులు మరియు నిర్వహణ పనులను అత్యవసర పరిస్థితుల్లో చేపడుతున్నందున వినియోగదారులు సహకరించాలని ఏపీఈపీడీసీఎల్ కాకినాడ ఎలక్ట్రికల్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. ఉదయ భాస్కర్ కోరారు.

## పుష్కర భక్తుల కోసం ఆధునిక జర్మన్ టెంట్లు, టెంట్ సిటీలు

ప్రయాగ వెండర్ బృందంతో సమావేశంలో కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, మే 15:**గోదావరి పుష్కర భక్తుల కోసం ఆధునిక జర్మన్ టెంట్లు, ప్రయాగ కుంభమేళా తరహా లో మౌలిక వసతుల ప్రణాళిక, యాత్రికులకు సురక్షిత వసతి, డ్రైనేజ్, పారిశుధ్యం, భద్రతపై సమగ్ర నివేదిక అందచేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కోరారు.

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కొవ్వూరు డివిజన్ పరిధిలో 16 ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో ప్రయాగ కుంభమేళా టెంట్ హౌస్ వెండర్స్ బృంద సభ్యులు పరిశీలించారు. అనంతరం బొమ్మూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ , రానున్న 2027 గోదావరి పుష్కరాలకు భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన వసతి సదుపాయాలు కల్పించేందుకు శాస్త్రీయ టెంట్ సిటీల ఏర్పాటు కు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నామని, ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలన్నారు. జూన్--జూలై నెలల్లో వర్షాలు, భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు ముందస్తు ప్రణాళికతో చేపట్టాల్సి ఉందన్నారు.

కుంభమేళా నిర్వహణలో అనుభవం కలిగిన ప్రయాగ బృంద సభ్యులు రాజమహేంద్రవరం, కొవ్వూరు పట్టణాల పరిధిలో జిల్లా యంత్రాంగం ప్రాథమికంగా గుర్తించిన 16 ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. టెంట్ల ఏర్పాటు, రవాణా సౌకర్యం, భద్రత, తాగునీరు, పారిశుధ్యం, అత్యవసర సేవల అంశాలపై సమగ్ర అంచనా వేశామని వెండర్ బృందం కలెక్టర్ కు వివరించారు. భక్తుల స్వల్ప విరామం కోసం ఆధునిక జర్మన్ టెంట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టెంట్ల వద్ద తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానాల గదులు, తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణ అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. జూన్, జూలై నెలలు వర్షపాతం ఉన్నందున టెంట్ల ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, డ్రై అవుట్ ప్లాన్ సిద్ధం చేయాలని, అత్యవసర నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేయలని సూచించారు.

టెంట్లు పూర్తి గా రైన్ ప్రూఫ్‌గా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలని, మురుగు నీటి నిర్వహణ కోసం సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య నిర్వహణను నిరంతర ప్రక్రియగా అమలు చేయాల న్నారు. వీఐపీ టెంట్లు, సాధారణ భక్తుల వసతి, అధికారుల ప్రత్యేక టెంట్లు, పోలీస్ స్టేషన్లు, కంట్రోల్ రూములు, వైద్య శిబిరాల విభాగాలకు విడివిడిగా ప్రణాళికా బద్ధంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రూట్ మ్యాప్ ఆధారంగా ట్రాఫిక్ భద్రతా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పనులు సమయానికి పూర్తిచేయాలంటే మూడు నెలల ముందుగానే గుర్తించిన స్థలాలను సంబంధిత సంస్థలకు అప్పగించాలని వెండర్స్ బృందం సూచించింది. దీనిపై జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి, అవసరమైన సమన్వయం డేటా పూర్తి స్థాయిలో అందజేస్తామని తెలిపింది. ఈ సందర్భంగా వెండర్స్ బృందం పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించింది. రాజమహేం ద్రవరం డివిజన్ పరిధిలో ధవళేశ్వరం, బొమ్మూరు, నాల్గవ వంతెన పరిసర ప్రాంతాలు, మహానాడు ప్రాంగణం , దివాన్ చెరువు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలోని స్థలాలు, బొమ్మూరు లోని నిర్మిత కేంద్రం, దేవదాయ శాఖ సైట్, హౌసింగ్ సైట్, కొవ్వూరు డివిజన్ ప్రాంతంలోని కొవ్వూరు వాటర్ వర్క్స్ స్థలాలు, స్పీక్ లే అవుట్, రైల్వే స్థలం, బాలాజీ టౌన్‌షిప్, తదితర ప్రాంతాలను పరిశీలించారు.

ఈ సమావేశం లో టూరిజం ఆర్.డి. ఎన్ వి వి ఎస్. మూర్తి, లల్లోజి బ్రదర్స్ కంపెనీ ప్రతినిధి వినాయక్ అగర్వాల్, జీకేఎస్ ప్రాజెక్ట్ అండ్ ఈవెంట్స్ ప్రతినిధి అభిషేక్ సింగాల్, లల్లోజీ ప్రతినిధి సిద్ధార్థ్ వ్యాస్, జిల్లా టూరిజం అధికారి పి వెంకట చలం, తదితరులు పాల్గొన్నారు.

## చింతలూరు పంచాయతీ కార్యాలయానికి నూతన ఏసీ

ఎమ్మెల్యే బండారు జన్మదిన వేడుకల్లో భాగంగా ఏర్పాటు





**ఆలమూరు, పెన్ పవర్,మే 15;**కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు బండారు సత్యానందరావు జన్మదినం సందర్భంగా ఆలమూరు మండలం చింతలూరు పంచాయతీ కార్యాలయానికి నూతన ఎయిర్ కండీషనర్‌ను ఏర్పాటు చేశారు. మార్చి నెలలో నిర్వహించిన నూకాంబికా అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా పంచాయతీ పరిధిలో జరిగిన పార్కింగ్ వేలంపాట దారులు, తీర్థ మహోత్సవాల అనంతరం అదనంగా మరో 15 రోజుల నిర్వహణకు సంబంధించి రూ.25 వేల మొత్తాన్ని పంచాయతీకి అందజేశారు. దీనికి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వైట్ల శేషుబాబు రూ.15 వేల ఆర్థిక సహకారం అందించారు. ఈ రెండు మొత్తాలు కలిపి రూ.40 వేల వ్యయంతో నూతన ఏసీని కొనుగోలు చేసి పంచాయతీ కార్యాలయంలో అమర్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు కలిసి నూతన ఏసీని స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే దిశగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాగరమాల ప్రాజెక్టులో భాగంగా 516 జాతీయ రహదారి పనుల పరిశీలన

- భూసేకరణ, నిర్మాణ పనులకు సహకరించాలి
- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్



**కాకినాడ రూరల్/యు.కొత్తపల్లి, మే 15:** సాగరమాల ప్రాజెక్టులో భాగంగా వాకలపూడి నుంచి అన్నవరం వరకు నిర్మిస్తున్న 516 జాతీయ రహదారి పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ముందుగా కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను జేసీ పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం యు.కొత్తపల్లి మండలంలోని మూలపేట,పొన్నాడ గ్రామాల్లో పర్యటించి భూ యజమానులతో మాట్లాడారు.జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగంగా పూర్తి కావడానికి భూ యజమానులు సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, సాగరమాల ప్రాజెక్టు కింద కాకినాడ పోర్టును జాతీయ రహదారులతో అనుసంధానం చేయడం ద్వారా సరుకు రవాణా మరింత సులభతరం అవుతుందని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక వసతులు మెరుగుపడటంతో పాటు ప్రజలకు వేగవంతమైన,సురక్షితమైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, నిర్మాణ పనుల్లో ఎటువంటి ఆటంకాలు కలగకుండా సంబంధిత భూ యజమానులు సహకరించాలని జేసీ కోరారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనుల్లో పురోగతి సాధించాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, పారదర్శకంగా పనులు నిర్వహించి నిర్ణీత కాలవ్యవధిలో ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో ఎన్‌హెచ్ఏఐ అధికారులు, కాకినాడ రూరల్ మరియు యు.కొత్తపల్లి మండలాల తహశీల్దార్లు ఎల్ఎస్ఎన్. కుమారి, చిన్నారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో SRH, RCB మ్యాచ్ టికెట్ ధరలు భారీగా పెంపు.. కోహ్లీ ఫ్యాన్స్ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్: ఐపీఎల్ 19లో భాగంగా 2026, మే 22న హైదరాబాద్?లోని ఉప్పల్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ జట్లు తలపడనున్నాయి. ఈ సీజన్?లో హైదరాబాద్?లో ఇదే లాస్ట్ మ్యాచ్ కావడం.. మరోవైపు ఆర్సీబీ, కోహ్లీ ఫ్యాన్స్ స్టేడియంలో మ్యాచ్ చూసేందుకు పెద్ద ఎత్తున ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఈ మ్యాచ్ టికెట్లకు భారీ డిమాండ్ నెలకొంది. ఈ డిమాండ్‌ను క్యాష్ చేసుకుంటూ మ్య?ాచ్ టికెట్ ధరలను ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం భారీగా పెంచింది. టికెట్ రేట్లను డబుల్ చేసింది. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ బుకింగ్స్ శుక్రవారం (మే 15) డిస్ట్రిక్ యాప్?లో ఓపెన్ అయ్యాయి. బుకింగ్స్ ఓపెన్ అయిన నిమిషాల్లోనే టికెట్ల కోసం అభిమానులు పోటీపడ్డారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో లక్షల మంది ఫ్యాన్స్ ఉన్నారు.

లక్షల సంఖ్యలో వెయిటింగ్ చూపిస్తే.. టికెట్ దొరకడమేలా అంటూ మండిపడుతున్నారు ఫ్యాన్స్. కాసేపట్లో సోల్డ్ ఔట్ అని పెట్టి.. టికెట్లను బ్లాక్ మార్కెట్ లోకి మళ్లిస్తున్నారని ఆరోపిస్తున్నారు ఫ్యాన్స్. బ్లాక్ టికెట్ దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు ఫ్యాన్స్. ముఖ్యంగా కోహ్లీ ఫ్యాన్స్ మండిపడుతున్నారు. టికెట్ ధరలు భారీగా పెంచడమే కాకుండా అసలు టికెట్లు అందుబాటులో లేకుండా చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ధరలు ఇవే

950 టికెట్ 2000 కి

1500 ఉన్న టికెట్ 3000 కి

1910 ఉన్న టికెట్ 3500 కి

2500 ఉన్న టికెట్ 4500 కి

4500 ఉన్న టికెట్ 6000 కి

7000 ఉన్న టికెట్ ధర 10 వేల రూపాయలకు

23 వేలు ఉన్న బాక్స్ టికెట్ ధర 30 వేల రూపాయలకు

30 వేలు ఉన్న కార్పోరేట్ బాక్స్ టికెట్ ధర 45 వేలకు పెంపు

## ఆర్సీబీలోకి కొత్త ప్లేయర్.. నువాన్ తుషారా రిప్లేస్‌మెంట్ ప్రకటించిన బెంగళూర్





**హైదరాబాద్ పెన్ పవర్:** బెంగళూర్: ప్లే ఆఫ్స్ ముంగిట డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ (ఆర్సీబీ) జట్టులో కీలక మార్పు చోటు చేసుకుంది. శ్రీలంక పేసర్ నువాన్ తుషార్ స్థానంలో ఇంగ్లాండ్ సీనియర్ బౌలర్ రిచర్డ్ గ్లీసన్ ఆర్సీబీ జట్టులోకి వచ్చారు. ఈ విషయాన్ని ఆర్సీబీ యాజమాన్యం శుక్రవారం (మే 15) అఫిషియల్?గా అనౌన్స్ చేసింది. శ్రీలంక క్రికెట్ బోర్డు నుంచి ఎన్వోసీ రాకపోవడంతో ఐపీఎల్ టోర్నీకి దూరమైన నువాన్ తుషారా స్థానంలో ఇంగ్లాండ్ పేసర్ రిచర్డ్ గ్లీసన్?ను రూ. 1.6 కోట్లకు జట్టులోకి తీసుకున్నట్లు ఆర్సీబీ ప్రకటించింది. 38 ఏళ్ల గ్లీసన్? ఇంగ్లాండ్ తరపున ఆరు అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించి తొమ్మిది వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ 2024లో చెన్నై సూపర్ కింగ్స్, ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ తరపున ఆడాడు. కానీ అతడికి పెద్దగా అవకాశాలు రాలేదు. కీలకమైన నాకౌట్ పోరులో ఈ అనుభవజ్ఞుడైన పేసర్ తమ బౌలింగ్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తాడని ఆర్సీబీ భావిస్తోంది. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన ఆర్సీబీ అందుకు తగ్గట్లుగా ఆడుతోంది. ఈ సీజన్?లో ఇప్పటి వరకు 12 మ్యాచులు ఆడిన ఆర్సీబీ 8 విజయాలు, నాలుగు పరాజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. 16 పాయింట్లతో ఆర్సీబీ ప్లే ఆఫ్స్ బెర్తును దాదాపు ఖరారు చేసుకుంది.

## అలాంటి పరిస్థితుల్లో ఆడలేను: వన్డే రిటైర్మెంట్‌పై కోహ్లీ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇప్పటికే టెస్ట్, టీ20 ఫార్మాట్?కు గుడ్ బై చెప్పిన భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కేవలం వన్డేలు మాత్రమే ఆడుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వన్డే రిటైర్మెంట్?, 2027 వన్డే వరల్డ్ కప్?లో ఆడటంపై కోహ్లీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను జట్టులో కొనసాగాలంటే పరస్పర గౌరవం ఉండాలని.. అంతేకానీ ప్రతిసారీ నా సత్తా నిరూపించుకోవాల్సి వస్తే అలాంటి పరిస్థితుల్లో తాను ఉండలేనని పరోక్షంగా బీసీసీఐకి తేల్చిచెప్పారు. తనకు ఆటపై ఎంతో నిబద్ధత, గౌరవం ఉందని.. ఆట కోసం తాను ఏమైనా చేస్తానని.. ఇదే సమయంలో అవతలి వైపు నుంచి కూడా తనకు గౌరవం ఇవ్వాలని.. అలాకాకుండా జట్టులో స్థానం కోసం పదే పదే నా సామర్థ్యాన్ని నిరూపించుకోవాలనే పరిస్థితులను తాను కోరుకోవడం లేదని.. అలాంటి పరిస్థితుల్లో ఆడటం తనకు ఆసక్తి లేదని స్పష్టం చేశారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) పాడ్‌కాస్ట్‌లో స్పోర్ట్స్ ప్రెజెంటర్ మయంతి లాంగర్‌తో కోహ్లీ మాట్లాడుతూ వన్డే రిటైర్మెంట్, 2027 వన్డే వరల్డ్ కప్?లో ఆడటం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. "నా ఆలోచన విధానం చాలా స్పష్టం. నా అవసరం ఉందనుకుంటే జట్టులో భాగస్వామ్యం అవుతా. తాను జట్టులో కొనసాగాలంటే పరస్పర గౌరవం ఉండాలి. ప్రతిసారీ నా సామర్థ్యం నిరూపించుకోవాల్సి వస్తే అలాంటి పరిస్థితుల్లో తాను ఉండలేను. ఎందుకంటే నా సన్నాహాల పట్ల నిజాయితీగా ఉన్నాను. ఆటను ఎదుర్కొనే విధానంలో నిజాయితీగా ఉంటా. ఏకాగ్రతతో కష్టపడతా. నా క్రికెట్ కెరీర్‌లో నాకు లభించిన ప్రతిదానికీ నేను దేవునికి రుణపడి ఉంటా. నేను ఆడటానికి వచ్చినప్పుడు ఏకాగ్రతతో ఆడతా. భారత క్రికెట్ పట్ల తన నిబద్ధత ఎన్నడూ మారలేదు. ఇన్నేళ్లుగా తన కెరీర్‌ను తీర్చిదిద్దిన అదే క్రమశిక్షణ, తీవ్రతతో తాను సన్నద్ధమవుతూనే ఉన్నాను" అని కీలక వ్యాఖ్యలు చేశారు కోహ్లీ. తాను ఫిట్ నెస్ విషయంలో ఇప్పటికీ కాంప్రమైజ్ అవ్వనని.. ఒక వన్డే మ్యాచ్‌లో 40 ఓవర్ల పాటు బౌండరీ చుట్టు పరిగెత్తామన్న పరిగెత్తుతానని.. దానికి తగినట్టుగానే సిద్ధమవుతానని తెలిపారు. 50 ఓవర్ల పాటు ప్రతి బంతిని నా కెరీర్‌లో ఆడబోయే చివరి బంతిగా భావించి ఆడతాననే చెప్పుకొచ్చారు. జట్టు కోసం నాతో సాధ్యమైనదంతా చేస్తానన్నారు. జట్టు కోసం ఇంత అంకితభావంతో పని చేసినప్పటికీ జట్టులో స్థానం కోసం పదే పదే నా సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సి వస్తే అలాంటి పరిస్థితుల్లో ఆడటం తనకు ఇష్టం లేదన్నారు. 2027 వన్డే వరల్డ్ కప్ ఆడాలనుకుంటున్నానని.. అందుకు తగ్గట్లుగా సన్నద్ధమవుతున్నాని తెలిపారు. భారత్ తరఫున ప్రపంచ కప్ ఆడటం అద్భుతమని అన్నారు. కోహ్లీ వ్యాఖ్యలను నిశితంగా పరిశీలిస్తే అతడికి బీసీసీఐతో గ్యాప్ ఉన్న మాట వాస్తవమేనని అంటున్నారు క్రీడా విశ్లేషకులు.

# మరో విడాకులు: 4 ఏళ్ల వైవాహిక బంధానికి మౌనిరాయ్ బ్రేకప్

గ్లామర్ ప్రపంచంలో జంటలు విడిపోవడం అనేది ఇటీవలి కాలంలో సర్వసాధారణంగా మారిపోయింది. రంగుల కలలు, విలాసవంతమైన జీవనశైలి, ఆర్థిక స్వేచ్ఛ వంటివి అప్పుడప్పుడు వ్యక్తిగత విభేదాలకు లేదా ఈగోలకు దారితీస్తున్నాయనే విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇటీవల నటి హన్సిక తన వైవాహిక జీవితంలో తలెత్తిన వివాదాలు, విడాకుల కథనాలతో నిరంతర వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. కొద్దిరోజులుగా మౌనిరాయ్ పైనా ఇలాంటి పుకార్లు కొనసాగుతున్నాయి. ఇంతలోనే ఇప్పుడు నటి మౌనీ రాయ్ కూడా తన భర్త సూరజ్ నంబియార్ నుంచి విడిపోతున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. గత నాలుగు ఏళ్లుగా వైవాహిక బంధంలో ఉన్న ఈ జంట సోషల్ మీడియాలో ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడంతో విడాకుల వార్తలు మొదట బయటకు వచ్చాయి. ఈ క్రమంలో మౌనీ రాయ్ పరపతిని, డబ్బును ఆమె భర్త వాడుకుని మోసం చేశాడంటూ మీడియాలో కొన్ని కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ తప్పుడు ప్రచారాలను మౌనీ- సూరజ్ తీవ్రంగా ఖండించారు. తమ సంబంధం గురించి వస్తున్న కల్పిత కథనాలు వాస్తవానికి దూరంగా ఉన్నాయని.. కేవలం సంచలనం కోసమే ఇలాంటి వార్తలను సృష్టిస్తున్నారని వారు అసహనం వ్యక్తం చేశారు. పరిస్థితిని గమనించిన ఈ జంట ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేస్తూ... తాము విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు అధికారికంగా ధ్రువీకరించారు. తమ వ్యక్తిగత ప్రాధాన్యతలు మారుతున్న తరుణంలో పరస్పర గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. విడిపోయినా భవిష్యత్తులో మంచి స్నేహితులుగా కొనసాగుతామని.. ఈ క్లిష్ట సమయంలో తమ ఏకాంతానికి భంగం కలిగించవద్దని మీడియాను, అభిమానులను అభ్యర్థించారు. ప్రైవసీని గౌరవించడం అత్యవసరమని వారు స్పష్టం చేశారు. సెలబ్రిటీల జీవితాల్లో జరిగే ఇలాంటి సంఘటనలు తరచుగా మీడియాలో చర్చనీయాంశమవుతుంటాయి. ఒకరి వ్యక్తిగత జీవితాన్ని అడ్డు పెట్టుకుని అసత్య ప్రచారాలు చేయడం సరికాదని ఈ జంట తమ నోట్‌లో ఘాటుగానే స్పందించారు. తాము విడిపోతున్న విషయాన్ని ప్రైవేట్‌గా, సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి సమయం కావాలని వారు కోరారు. వివాహ బంధం ముగిసినా... ఒకరిపై ఒకరికి ఉన్న గౌరవాన్ని కాపాడుకుంటూ విడిపోవడమే ఉత్తమమని వారు భావిస్తున్నారు.

ఏది ఏమైనా మౌనీ రాయ్ – సూరజ్ నంబియార్ విడిపోవడం బాలీవుడ్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. సెలబ్రిటీలు తమ వ్యక్తిగత సమస్యలను బహిరంగపరచడానికి ఇష్టపడరు కాబట్టి.. వారి నిర్ణయాన్ని గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఈ ప్రకటనతో ఇప్పటి వరకు వస్తున్న రకరకాల పుకార్లకు చెక్ పడినట్లయింది. భవిష్యత్తులో వారు తమ తమ కెరీర్‌లపై దృష్టి సారిస్తూ వ్యక్తిగత ప్రశాంతతను కోరుకుంటున్నారు.



**ఇషా తల్వార్ మండుతున్న రెడ్ లుక్‌లో గ్లామ్ కోటియన్‌గా మారిపోయింది**



**మానస వారణాసి గ్రేస్ మరియు గ్లామర్‌తో స్పాట్‌లైట్‌ను దొంగిలించింది**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com